31వ వసంతంలోకి

చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా

శుక్రవారం, నవంబర్ 06 , 2026

పేజీలు : 8

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు



చురకలు విలేకరి, మెట్‌పల్లి రూరల్, నవంబర్ 5: అంగన్వాడీ కేంద్రాలు చిన్నారుల ఎదుగుదలలో కీలక పాత్ర పోషిస్తున్నాయని కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ పేర్కొన్నారు.ఈ మేరకు గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో చిన్నారులకు మెరుగైన వసతులు కల్పించే లక్ష్యంతో రూ.12 లక్షల నిధులతో నిర్మించనున్న నూతన అంగన్వాడీ భవన నిర్మాణానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజ య్ స్థానిక నాయకులతో-మిగతా 2లో

ధన త్రయోదశి నుంచి దీపావళి









- మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక శోభ
- సంపదకు ధన్వంతరి పూజ
- చెడుపై మంచి విజయానికి నరక చతుర్దశి
- ఐశ్వర్యం కోసం లక్ష్మీపూజ
- పర్యావరణహిత దీపావళికి ప్రాధాన్యత ఇవ్వాలి

చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం : నవంబర్ (05) : భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే దీపావళి పర్వదినాల సందడి మొదలుకానుంది. ధన త్రయోదశి నుంచి నరక చతుర్దశి, దీపావళి వరకు వరుసగా మూడు రోజుల పాటు ఆధ్యాత్మిక వాతావరణం నెలకొననుంది. చీకటిపై వెలుగు, చెడుపై మంచి, అజ్ఞానంపై జ్ఞానం సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళి పండుగకు ప్రజలు -మిగతా 2లో

ప్రభుత్వ విద్యాలయాల్లో సకల సౌకర్యాలు





-విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా వసతి, తరగతి గదుల నిర్మాణం
-రూ.95.50 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్

చురకలు ప్రతినిధి, రాజన్న సిరిసిల్ల , నవంబర్ 05: ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతి గదులు, వసతి గదులు, టాయిలెట్లు తదితర సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. కోన రావుపేట మండల కేంద్రంలోని కసూ ్తర్బా గాంధీ బాలికల విద్యాలయంలో రూ.56 లక్షలతో నూతన వసతి గృ హం, టాయిలెట్ల నిర్మాణానికి, రూ.9. 50 లక్షలతో భవిత కేంద్రం నిర్మాణా నికి, రూ.30 లక్షలతో ఐకేపీ గోడౌన్ నిర్మాణానికి గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి శంకుస్థాపన చేశారు. మొత్తం రూ.95.50 -మిగతా 2లో

రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

-వెయ్యి టీఎంసీల నీటిని సముద్రం పాలు చేసిన ఘనత రేవంత్ రెడ్డిదే
-క్రాప్ హాలిడే ప్రకటిస్తే రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం చెల్లించాలి
ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



కమలాపూర్ మండలంలో గురువారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి

చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 5 : రైతులకు సాగునీరు అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, గోదావరి నుంచి సుమారు 750 టీఎంసీలు, కృష్ణా నుంచి 250 టీఎంసీల నీటిని వినియోగించు కోకుండా సముద్రం పాలుచేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికే దక్కుతుందని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విమర్శించారు. క్రాప్ హాలిడే ప్రకటిస్తే పంటలు సాగు చేయలేక నష్టపోయే ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు -మిగతా 2లో

చిన్నారుల ఉజ్వల భవిష్యత్తుకు బాటలు

మొదటి పేజీ తరువాయి... కలిసి భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ.. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధితో చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు,వారి బంగారు భవిష్యత్తుకు పునాది పడుతుందని చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణ, పోషకాహార లోప నివారణ, ప్రాథమిక విద్యాభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు ఎంతగానో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులకు పట్టణ స్థాయిలో మెరుగైన సౌకర్యాలు అందించాలనే ఉద్దేశంతో నూతన అంగన్వాడీ భవనాలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. నూతన భవనాన్నికి నాణ్యమైన నిర్మాణ పనులు చేపట్టి, చిన్నారులకు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణంలో విద్యాబోధన, పౌష్టికాహారం అందేలా చూడాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేపూరి సుమలత జీవన్ రెడ్డి,ఉపసర్పంచ్ పిల్లి చిన్న మల్లేష్,మాజీ సర్పంచ్ కోరేపు రవి,బిఆర్ఎస్ నాయకులు ముదం రమేష్, రఘుపతి రెడ్డి,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

డా. వి.ఆర్.కె. ఫార్మసీ కళాశాల, జగిత్యాలలో ఘనంగా ఓరియంటేషన్ డే వేడుకలు



జగిత్యాల చురకలు : డా. వి.ఆర్.కె. కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, జగిత్యాలలో ఓరియంటేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లిడా. వి.ఆర్.కె. ఎడ్యుకేషనల్ సొసైటీ, హైదరాబాద్ డైరెక్టర్ రహమాన్ షరీఫ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ప్రముఖులు మాట్లాడుతూ... విద్యార్థులు శ్రద్ధతో చదివి తల్లిదండ్రులకు మరియు కళాశాల ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో తీసుకురావాలని కోరారు. ఫార్మసీ విద్య యొక్క ప్రాముఖ్యతను, భవిష్యత్తులో ఉన్న ఉద్యోగ అవకాశాలను వివరించారు.ఈ సందర్భంగా ప్రముఖులుగా లిడైరెక్టర్ ప్రొఫెసర్ డా. దండు రామకృష్ణ,, ప్రిన్సిపాల్, షాదాన్ ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, హైదరాబాద్, జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. పి. శశిధర్ , వైస్ ప్రిన్సిపాల్, షాదాన్ ఉమెన్స్ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. హెచ్. పరమేశ్వర్ , అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా. మీర్ కాజిమ్ అలీ పాల్గొన్నారు.కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నార

విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: ఎమ్మెల్యే మసీద్ హుస్సేన్

-జగిత్యాలలో ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచిత గైడ్స్ పంపిణీ

- 150 మంది డిగ్రీ విద్యార్థులకు పుస్తకాల కొనుగోలుకు ఆర్థిక సాయం



జగిత్యాల: విద్యార్థుల సమస్యలను పరిష్కరిం చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నాంపల్లి ఎమ్మెల్యే మసీద్ హుస్సేన్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.జగిత్యాల జిల్లా కేంద్రంలో ఎంఐఎం ఆధ్వర్యంలో నిర్వహించిన సలార్ ఈ మిలాద్ ఆల్ ఇన్ వన్ గైడ్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉర్దూ మీడియం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా గైడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జగిత్యాల ప్రజల ఓట్లతో గెలిచిన నాయకులు నియోజకవర్గ అభివృద్ధికి ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.రెండు పడవలపై ప్రయాణం చేసేవారు చివరకు రెండు పడవలనూ ముంచుతారంటూ స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను ఉద్దేశించి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. ఆయనపై పలు విమర్శలు చేశారు.ఇదిలా ఉండగా, జగిత్యాల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన 150 మంది విద్యార్థినులు తమకు ప్రభుత్వం నుంచి పుస్తకాలు అందలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. స్పందించిన మసీద్ హుస్సేన్ విద్యార్థినులకు అవసరమైన పుస్తకాల కొనుగోలుకు స్వయంగా డబ్బులు చెల్లించారు.ఎంఐఎం నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విద్యాలయాల్లో సకల సౌకర్యాలు

మొదటి పేజీ తరువాయి...లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి ప్రాధాన్యత నిస్తూ అవసరమైన నిధులు మంజూరు చేస్తోందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతో పాటు కాస్మోటిక్, డైట్ ఛార్జీలను పెంచిందని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టడంతో పాటు తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతోందన్నారు. ఉపాధ్యాయుల ఖాళీల భర్తీకి కూడా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు.ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని కష్టపడి చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి.

కేజీబీవీ, భవిత కేంద్రం, ఐకేపీ గోడౌన్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి నిర్దీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం నిర్మాణాలను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.

ఐకేపీ గోడౌన్‌తో రైతులకు ప్రయోజనం.

కోనరావుపేట మండల కేంద్రంలో రూ.30 లక్షలతో నిర్మించనున్న ఐకేపీ గోడౌన్‌కు సైతం ప్రభుత్వ విప్, కలెక్టర్ శంకుస్థాపన చేశారు. గోడౌన్ నిర్మాణం పూర్తయితే వ్యవసాయ ఉత్పత్తుల నిల్వకు ఉపయోగపడుతుందని, సంబంధిత పనులను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చకాయల ఎల్లయ్య, పీఏసీఎస్ చైర్మన్లు చేపూరి గంగాధర్, బొమ్మెన భాస్కర్ రావు, ఆర్డీఓ కేఎస్‌బీ కుమారి, డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, కోనరావుపేట సర్పంచ్ కాశీరామ్, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని దేవరాజు, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, జీసీడీఓ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి....తాలు, తరుగు పేరుతో అధికంగా కోతలు విధించకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని కోరారు. హుజూరాబాద్ నియోజకవర్గంలోని కమలాపూర్, ఇల్లంతకుంట, జమ్మికుంట, వీణవంక, హుజూరాబాద్ మండలాలతో పాటు రెండు పట్టణాల పరిధిలో రైతులు సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పదెకరాల భూమి ఉన్న రైతులు నీటి కొరత కారణంగా ఐదెకరాలు, నాలుగెకరాలు మాత్రమే సాగు చేస్తున్నారని, ఐదెకరాల భూమి ఉన్నవారు రెండు ఎకరాలు, ఎకరం మాత్రమే సాగు చేసుకునే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. సముద్రంలోకి నీటిని వదులుతారా? కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద 25 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్నప్పటికీ కాళేశ్వరం నీటిని ఎందుకు ఎత్తడం లేదని ప్రశ్నించారు. కేంద్ర జల సంఘం గణాంకాల ప్రకారం ఆన్‌లైన్‌లో నీటి ప్రవాహ వివరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో కేటీఆర్‌తో కలిసి వేలాది మంది రైతులతో కన్నెపల్లి పంప్‌హౌస్‌ను సందర్శించి లక్ష క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని గుర్తుచేశారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. కెసిఆర్ పాలనలో ఇబ్బందులు పడలేదు కేసీఆర్ పదేళ్ల పాలనలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతుబీమా వంటి పథకాలు అందాయని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే సాగునీటి సమస్యలు, విద్యుత్ కోతలు, యూరియా, డీఏపీ కొరతలు ఎందుకు ఏర్పడుతున్నాయని ప్రశ్నించారు. ఏ పంట పండించినా క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయండి కాళేశ్వరం ప్రాజెక్టుకు రోజుకు మూడు టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉందని, ఇప్పటికీ సమయం మించిపోలేదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే నీటిని ఎత్తిపోసి రైతులకు అందిస్తే పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతుల జీవితాలతో రాజకీయాలు చేయవద్దని, సాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.

సాగునీరు ఇవ్వండి

హుజూరాబాద్ నియోజకవర్గంలోని ఐదు మండలాలు, రెండు పట్టణాల పరిధిలో రైతులకు తక్షణమే సాగునీరు అందించాలని, క్రాప్ హాలిడే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకవేళ క్రాప్ హాలిడే ప్రకటిస్తే నష్టపోయే ప్రతి రైతుకు ఎకరాకు రూ.50 వేల చొప్పున పరిహారం చెల్లించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రైతుల హక్కుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు..ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేన రెడ్డి, సత్యనారాయణ రావు, మాజీ జడ్పీటీసీ నవీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ ఝాన్సీ రవీందర్, కేడీసీసీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు రాజేష్, పుల్ల శ్రీను, శ్రీకాంత్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌తో పాటు పలువురు సర్పంచులు, మాజీ సర్పంచులు, సింగిల్ విండో డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ధన త్రయోదశి...

మొదటి పేజీ తరువాయి..

సిద్ధమవుతున్నారు. ఇళ్లను శుభ్రం చేసి రంగురంగుల ముగ్గులు, విద్యుత్ దీపాలతో అలంకరిస్తూ పండుగకు స్వాగతం పలుకుతున్నారు.

ధన త్రయోదశి.. ఆరోగ్యం, ఐశ్వర్యానికి ప్రతీక

నవంబర్ 6న శుక్రవారం ధన త్రయోదశి పర్వదినాన్ని జరుపుకోనున్నారు. ధన్‌తేరస్‌గా ప్రసిద్ధి చెందిన ఈ రోజున ధన్వంతరి స్వామి, లక్ష్మీదేవి, కుబేరుడిని భక్తులు పూజిస్తారు. సముద్ర మథనం సమయంలో అమృత కలశంతో ధన్వంతరి స్వామి ఆవిర్భవించారని పురాణాలు చెబుతున్నాయి. అందుకే ఈ రోజును ధన్వంతరి జయంతిగా కూడా భావిస్తారు. ఆయురారోగ్యాలు, సంపద, సుఖసంతోషాలు కలగాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. బంగారం, వెండి, కొత్త పాత్రలు కొనుగోలు చేయడం శుభప్రదమని ప్రజలు విశ్వసిస్తారు. సాయంత్రం ఇంటి గుమ్మం వద్ద దీపాలు వెలిగించి కుటుంబ క్షేమం కోసం ప్రార్థిస్తారు.

నరక చతుర్దశి.. చెడుపై మంచి సాధించిన విజయం

నవంబర్ 7న శనివారం నరక చతుర్దశి (చిన్న దీపావళి) జరుపుకోనున్నారు. శ్రీకృష్ణుడు సత్యభామ సమేతంగా నరకాసురుడిని సంహరించి ప్రజలకు విముక్తి కలిగించిన రోజుగా పురాణ గాథలు వివరిస్తాయి. నరకాసురుడి పీడ విరగడ కావడంతో ప్రజలు ఆనందంగా దీపాలు వెలిగించి సంబరాలు చేసుకున్నారని చెబుతారు. ఈ రోజున తెల్లవారుజామున అభ్యంగన స్నానం చేయడం, ఇంటిని శుభ్రం చేసుకోవడం, దీపాలు వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. మనిషిలోని అహంకారం, అసూయ, ద్వేషం వంటి చెడు లక్షణాలను తొలగించుకొని సన్మార్గంలో నడవాలనే సందేశాన్ని ఈ పర్వదినం అందిస్తుంది.

దీపావళి.. లక్ష్మీపూజకు విశేష ప్రాధాన్యత..

నవంబర్ 8న ఆదివారం ప్రధాన దీపావళి పండుగను జరుపుకోనున్నారు. ఈ రోజున సంపదలకు అధిదేవత అయిన శ్రీ మహాలక్ష్మిని భక్తులు ప్రత్యేకంగా పూజిస్తారు. ఇంటిని శుభ్రపరిచి పూలతో అలంకరించి, రంగురంగుల ముగ్గులు వేసి మట్టి ప్రమిదల్లో దీపాలు వెలిగిస్తారు. సాయంత్రం వేళ లక్ష్మీదేవి, గణపతి, కుబేరుడికి పూజలు నిర్వహించి నైవేద్యాలు సమర్పిస్తారు. కుటుంబంలో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థిస్తారు. వ్యాపారులు తమ దుకాణాలు, వ్యాపార సంస్థల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వ్యాపారాభివృద్ధిని కోరుకుంటారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు ఒకచోట చేరి మిఠాయిలు పంచుకుంటూ పండుగను ఆనందంగా జరుపుకుంటారు.

మార్కెట్లలో కొనుగోళ్ల సందడి ..

పండుగను పురస్కరించుకొని గ్రామాలు, పట్టణాల్లోని మార్కెట్లు కొనుగోలుదారులతో సందడిగా మారుతున్నాయి. పూలు, పూజా సామగ్రి, మిఠాయిలు, పండ్లు, కొత్త దుస్తులు, మట్టి ప్రమిదలు, అలంకరణ వస్తువుల కొనుగోళ్లు ఊపందుకుంటున్నాయి. చిన్నారులు బాణసంచా కొనుగోళ్లపై ఆసక్తి చూపుతుండగా వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఇంటా పండుగ వాతావరణం కనిపిస్తోంది.

మిషన్ భగీరథ నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

-వెంటనే మరమ్మతు పనులు ప్రారంభించిన : కౌన్సిలర్ పొట్ట సురేందర్



చురకలు ప్రతినిధి కోరుట్ల నవంబర్ 05 : కోరుట్ల పట్టణంలోని 16వ వార్డు ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యంగా వార్డు కౌన్సిలర్ పొట్ట సురేందర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు.వార్డులో నెలకొన్న మిషన్ భగీరథ నీటి సమస్యను మున్సిపల్ డీఈ అరుణ్ దృష్టికి తీసుకెళ్ళి, వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.దీంతో స్పందించిన అధికారులు గురువారం మరమ్మతు పనులను ప్రారంభించారు.కౌన్సిలర్ పొట్ట సురేందర్ మాట్లాడుతూ వార్డు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని ,పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఏఈ సూర్య,శ్రీనివాస్,వార్డు ప్రజలు,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్కేలో ఘనంగా ఓరియంటేషన్ డే



చురకలు విలేకరి,జగిత్యాల,నవంబర్ 5 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని డా. వీఆర్కే ఫార్మసీ కళాశాలలో ఓరియంటేషన్ డే వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా వీఆర్కే ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ రహమాన్ షరీఫ్ హాజరయ్యారు. విద్యార్థులు శ్రద్ధతో చదివి కళాశాల ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని, ఫార్మసీ విద్య ప్రాముఖ్యత,ఉద్యోగ అవకాశాలను ఆయన వివరించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొ. డా. దండు రామకృష్ణ,జాయింట్ డైరెక్టర్ ప్రొ.డా.పి.శశిధర్, ప్రిన్సిపాల్ ప్రొ.డా. హెచ్. పరమేశ్వర్,అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డా.మీర్‌ఖాజీం అలీ తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశ భవిష్యత్తు



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 5 : 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశాన్ని చూడాలంటే యువతలో బాధ్యత, నైపుణ్యం పెంపొందాలని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు కొండ్ర రవితేజ అన్నారు.గురువారం జిల్లా అధ్యక్షుడు ఇట్టేడి రాజు ఆదేశాల మేరకు పట్టణంలో యువ సంవాద్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ వికసిత్ భారత్ – 2047 లక్ష్యాన్ని కళాశాల విద్యార్థుల్లోకి తీసుకెళ్లడమే ఉద్దేశమని, విద్యార్థులు ఉద్యోగాలకే పరిమితం కాకుండా నూతన ఆవిష్కరణలతో దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూదరి పవన్, ప్రధాన కార్యదర్శి ఆముద రాజు, బీజేవైఎం నాయకుడు పవన్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధు మెసేజ్‌లతో రైతుల్లో అయోమయం

-ఖాతాల్లో డబ్బులు జమ కాకుండానే ఫోన్లకు సందేశాలు
-బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న రైతన్నలు
-జిల్లా యంత్రాంగం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్న వ్యవసాయ శాఖ అధికారులు



చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం నవంబర్ (05) : రైతుబంధు పెట్టుబడి సాయానికి సంబంధించి రైతుల మొబైల్ ఫోన్లకు సందేశాలు రావడంతో జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండల రైతుల్లో అయోమయం నెలకొంది. జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని గోదూర్, తిమ్మపూర్, తిమ్మపూర్ తండ, యామాపూర్, ఫకీర్ కోండపూర్, వేములకుర్తి, వర్షకొండ, ఎర్దండి, అమ్మక్కపేట, డబ్బ, బర్దిపూర్, మూలరాంపూర్, ఫకీర్ కొండాపూర్, కోజన్ కొత్తూర్, కోమటికొండాపూర్, ఎర్రపూర్ ,కోజన్ కొత్తూరు, కేశపూర్ తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులకు రైతుబంధు నిధులకు సంబంధించిన సందేశాలు రెండు రోజులు గా రావడంతో తమ ఖాతాల్లో డబ్బులు జమయ్యాయని భావించారు. అయితే బ్యాంకు ఖాతాలను పరిశీలించగా నగదు జమ కాకపోవడం తో రైతులు అయోమయానికి గురవుతున్నారు. మెసేజ్‌లు రావడంతో డబ్బులు వచ్చాయని ఆశపడి బ్యాంకులకు వెళ్లిన రైతులకు నిరాశ ఎదురవుతోంది. అసలు నిధులు విడుదలయ్యాయా , లేదా మెసేజ్‌లు ఎందుకు వచ్చాయి అన్న సందేహాలు రైతుల్లో వ్యక్తమవుతున్నాయి.ఈ సందర్భంగా ఇబ్రహీంపట్నం మండల వ్యవసాయ అధికారి అకు రాజ్ కుమార్ ను వివరణ కోరగా రైతుబంధు నిధుల జమకు సంబంధించి జిల్లా యంత్రాంగం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు గానీ, అధికారిక సమాచారం గానీ అందలేదని,రైతుల ఖాతాల్లో నగదు జమపై తమకు ప్రస్తుతం ఎలాంటి స్పష్టత లేదన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రైతుబంధు నిధుల విడుదలపై స్పష్టమైన సమాచారం అందించాలని, రైతుల్లో నెలకొన్న అయోమయాన్ని తొలగించాలని మండల రైతులు కోరుతున్నారు.

ఆలయాలను అనుసంధానం చేస్తూ రైల్వే సౌకర్యం కల్పించాలి

-మాజీ ఎఎంసి చైర్మన్ పత్తిపాక వెంకటేష్



చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 05 :

వేములవాడ,ధర్మపురి, కొండగట్టు,గూడెం,కోటిలింగాలపవిత్ర దేవాలయాలనుఅనుసంధానం చేస్తూ భక్తులకు రైల్వే రవాణా సౌఖర్యం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని వెల్గటూర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పత్తిపాక వేంకటేష్ ఓ ప్రకటనలో కోరారు. దీనివల్ల ఆయా జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధి జరగడానికి అవకాశంఉందనితెలిపారు. దక్షిణ కాశిగా పేరొందిన వేములవాడ రాజరాజేశ్వర స్వామి, మరో అన్నవరం గూడెం సత్యనారాయణ స్వామి, గోదావరి నదీతీరంలో ని ధర్మపురి లక్ష్మీ నరసింహా స్వామి, శాతవాహన తొలి రాజదాని కోటిలింగాల కోటేశ్వరస్వామీ, కొండగట్టు ఆంజనేయ స్వామి ఆలయా లతో పాటు చుట్టుపక్క జిల్లా ల్లోని మరిన్ని ఆలయాలు, పర్యాటక ప్రాంతాలు భక్తులు సందర్శించేందుకు సౌఖర్యం ఏర్పడుతుందని, టూరిజం అభివృద్ధితో రాష్ట్రానికి ఆదాయం సమకూరుతుంద ని,దీన్ని దృష్టిలో పెట్టుకొని ఈ ప్రాంత ఎంపీ లు,రాష్ట్ర ప్రభుత్వం కేంద్రప్రభుత్వ రైల్వే మంత్రిత్వ శాఖతో మాట్లాడి ఆలయాలకు రైల్వే మార్గం ఏర్పాటుకు చర్యలు తీసుకో వాలని వెంకటేష్ కోరారు.

గిరిజనుల సంక్షేమం కేసీఆర్‌తోనే సాధ్యం



-మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి

చురకలు విలేకరి,బీర్‌పూర్, నవంబర్ 5 : గిరిజనుల అభివృద్ధి కేసీఆర్ పాలనలోనే జరిగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి అన్నారు. గురువారం సారంగాపూర్ మండలం ధర్మనాయక్ తండాలోని సేవాలాల్ మందిరంలో పూజలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో 6 శాతం ఉన్న గిరిజన రిజర్వేషన్లను తెలంగాణ వచ్చాక కేసీఆర్ 10 శాతానికి పెంచారని, తండాలను గ్రామ పంచాయతీలుగా చేసి రోడ్లు, మురికి కాలువలు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా ప్రాంగణాలు, మిషన్ భగీరథ, వైకుంఠధామాలు ఏర్పాటు చేశారని తెలిపారు. ప్రతి జిల్లాకు మెడికల్ కాలేజీ ఇచ్చి 10 వేలకు పైగా మెడికల్ సీట్లు తీసుకొచ్చిన ఘనత కేసీఆర్ దేనని, ఇప్పుడు కడుతున్న భవనాలు, కెనాల్ పై రోడ్డు కూడా బీఆర్ఎస్ హయాంలో మంజూరైనవేనని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేళ్లలో కడితే, తుమ్మడిహట్టి ప్రాజెక్టును రేవంత్ రెడ్డి ప్రభుత్వం కట్టలేకపోతోందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో సర్పంచులు సంతోష్, రమేష్, రమ భాస్కర్, మండల అధ్యక్షుడు తేలు రాజు, సత్యంరావు, ఆకుల రాజిరెడ్డి, చిరంజీవి, ఆనంద్ రెడ్డి, గంగాధర్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత



-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్

చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 5 : ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. గురువారం పొలాస గ్రామంలోని శ్రీ పొలేస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. పొలాస ఆలయంలో కళ్యాణ మండపం, ప్రహరీ నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టామని, నియోజకవర్గంలోని అన్ని ఆలయాలకు నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరుతో గ్రామగ్రామాన పండుగ వాతావరణం నెలకొందని, పొలాసలోనే 50 ఇళ్ల నిర్మాణం కొనసాగుతోందని అన్నారు. ఎల్ నినో ప్రభావంపై అసత్య ప్రచారాలు నమ్మవద్దని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడాలని, రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, ఆలయ చైర్మన్ భూమన్న, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బాల ముకుందం, తదితరులు పాల్గొన్నారు.

మల్యాల పీహెచ్సీలో వైద్య సేవలు మెరుగుపరచాలి

చురకలు విలేకరి, మల్యాల,నవంబర్ 5 : మల్యాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత మూడేళ్లుగా వైద్య సేవలు సక్రమంగా అందడం లేదని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు.గురువారం ఆయన మాట్లాడుతూ రోగుల పట్ల కొందరు సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని,ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేదని ఆరోపించారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టే పరిస్థితి ఉందన్నారు. ఈ మేరకు జిల్లా వైద్యాధికారికి వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పీహెచ్సీపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకొని మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.

నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌కు ఘన సన్మానం



చురకలు ప్రతినిధి కోరుట్ల,నవంబర్,05 : కోరుట్ల పట్టణానికి విచ్చేసిన హైదరాబాద్ నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను కోరుట్ల పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, పార్టీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. పూలమాలలు, శాలువాలతో ఆయనను సత్కరించారు.ఈ సందర్భంగా కోరుట్ల పట్టణంలో ఎంఐఎం పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు అవసరమైన సూచనలు, సలహాలు అందించాలని ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్‌ను కోరారు. స్థానిక కార్యకర్తలకు మార్గదర్శనం చేస్తూ పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల ఐక్యతకు తన సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో కోరుట్ల పట్టణ ఎంఐఎం పార్టీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ, కార్యదర్శి మహమ్మద్ వాజిద్, కోశాధికారి ముజాహిద్, జాయింట్ సెక్రటరీ అబ్దుల్ రహీం, రహీం ఖురేషి తదితరులు పాల్గొన్నారు.

అడ్డొచ్చిన కోతిని తప్పించబోయి ఆటోబోల్తా

-ఇరువురికి గాయాలు





చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 05 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్‌రావుపేట, పైడిపల్లి ఎక్స్ రోడ్ మధ్య రాష్ట్ర రహదారిపై గురువారం అడ్డువచ్చిన ఓకోతినితప్పించే క్రమంలో ఆటో బోల్తా పడడంతో సంకెనపల్లికి చెందినఆటో డ్రైవర్ అబ్దుల్ తోపాటు మరో వ్యక్తికి తీవ్రగాయాల య్యాయి.అదే సమయంలో అటుగా వెళుతున్న వెల్గటూర్ పోలీస్ కానిస్టేబుల్ నరేష్ ప్రమాదం గమనించి స్థానికులసహాయం తోఆటోను పైకిలేపి గాయపడి న వారిని అంబులెన్స్‌లో దగ్గరలోని ధర్మారంఆసుపత్రికి తరలించారు.ఆటోలోఎక్కువ మంది ప్రయాణికులు లేకపోవ డంతో ఘోర ప్రమాదం తప్పింది.

ముస్లింల విద్యా ప్రమాణాలను

మెరుగు పరిచేందుకు ఎంఐఎం కృషి

-నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 5 : తెలంగాణ రాష్ట్రంలో ముస్లింల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ఎంఐఎం పార్టీ విశేషంగా కృషి చేస్తుందని నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ అన్నారు. గురువారం జగిత్యాల పట్టణంలో రూబీ ఫంక్షన్ హాల్లో ఏర్పాటుచేసిన సాలారే మిల్లత్ ఆల్ ఇన్ వన్ 2026 గైడ్స్ ను జగిత్యాల పట్టణ ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్‌మాట్లాడుతూ విద్యార్థులందరూ ముఖ్యంగా బాల, బాలికలు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, జీవితంలో పదవ తరగతి వార్షిక పరీక్ష కీలకమని, ఈ పరీక్షలో ఉత్తీర్ణులు అవ్వడానికి సాలారే మిల్లత్ గైడ్ దోహదపడుతుందని అన్నారు. మాజీ ఎంపీ దివంగత సుల్తాన్ సలావుద్దీన్ ఓవైసీ భవిష్యత్ తరాలకు ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో గత 25 సంవత్సరాల క్రితం ఆల్ ఇన్ వన్ గైడ్లను ఎంఐఎం పార్టీ తరపున ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు అందజేస్తున్నట్లు, సాలారే మిల్లత్ తర్వాత, తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీలు తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో ఉర్దూను బ్రతికించడం కోసం ఉర్దూ మీడియం పాఠశాలల విద్యా ప్రమాణాలు పెంచడం కోసం, ముస్లింల విద్య అభివృద్ధి కోసం అమోఘమైనటువంటి కృషి చేస్తున్నట్లు తెలిపారు. తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీల సారథ్యంలో హైదరాబాద్ నగరవ్యాప్తంగా పేద ముస్లింల పిల్లలకు బాసటగా నిలవాలని సంకల్పంతో కార్పొరేట్ స్థాయిలో 20 పాఠశాలలను స్థాపించి, 20 వేల మంది విద్యార్థులకు ప్రతి ఏటా విద్యను ఉచితంగా అందిస్తున్న టువంటి ఘనత వీరికి దక్కుతుందన్నారు. ముస్లిం యువత చెడు వ్యసనాలను మాని ఉన్నతమైనటువంటి చదువులు చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి రాజకీయాల్లో రాణించాలని తమ అధినేత బారిష్టర్ అసదుద్దీన్ ఓవైసీ పిలుపునిచ్చారని గుర్తుచేశారు. సాలారే మిల్లత్ గైడ్స్ ను దివంగత సుల్తాన్ సలావుద్దీన్ నాడు భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా ఈవిద్యా ప్రణాళికను తయారు చేశారని ఆయన గొప్ప సంకల్పంతో నేడు ముస్లింలు క్రీడల్లో, ఉన్నత విద్యలో, సివిల్స్ ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, గ్రూప్1 వంటి ఉద్యోగాల్లో, డాక్టర్లుగా, ఇంజనీర్లుగా , ఇటు రాజకీయాల్లో రాణిస్తున్నారని చెప్పారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం కరీంనగర్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఖాజా లియాఖాత్ అలీ మొహసీన్, జమాతే ఇస్లామీ జిల్లా అధ్యక్షుడు షోయబ్ ఉల్ హఖ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు సుమేర్ అలీ, కౌన్సిలర్ రజియుద్దీన్, కౌన్సిలర్ డా. అయ్యుబ్ ఖాన్, నాయకులు, నౌమాన్, వహీద్, జిల్లా ఉపాధ్యక్షుడు బాసిత్, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూతన నియామకం



చురకలు (పెద్దపల్లి జిల్లా (ప్రతినిధి)కమాన్ పూర్ నవంబర్ 5 : కమాన్ పూర్ మండల కేంద్రం చెందిన జంగేపల్లి అజయ్ పెద్దపల్లి జిల్లా బిజెపి ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు.పెద్దపల్లి బిజెపి ఓబీసీ మోర్చా అధ్యక్షులు శాతరాజు రమేష్ పెద్దపల్లి జిల్లా కేంద్రంలో పెద్దపల్లి ఓబీసీ మోర్చా బిజెపి జిల్లా కమిటీ ప్రకటించడం జరిగింది. ఈ జిల్లా కమిటీలో కమాన్ పూర్ మండల కేంద్రానికి చెందిన బిజెపి సీనియర్ నాయకులు జంగేపల్లి అజయ్ ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించడం జరిగింది.చిన్నప్పటి నుంచే రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వయంసేవక్‌గా, విద్యార్థి దశలో ఏబీవీపీ నాయకునిగా ప్రస్థానాన్ని ప్రారంభించారు.దేశభక్తి, క్రమశిక్షణ, జాతీయ భావాలు, సమాజ సేవ అనే విలువలతో స్ఫూర్తి పొంది భారతీయ జనతా పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ వివిధ బాధ్యతలను నిర్వహించారు.అజయ్ రాజకీయ ప్రస్థానంలో నిర్వహించిన బాధ్యతలు.రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వయంసేవక్ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ నాయకుడు కమాన్ పూర్ గ్రామ బీజేపీ అధ్యక్షుడు కమాన్ పూర్ బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా రెండుసార్లు పెద్దపల్లి జిల్లా భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యదర్శి కమాన్ పూర్ బీజేపీ మండల అధ్యక్షుడు బాధ్యతలు నిర్వహించడం జరిగింది.ఇప్పుడు పెద్దపల్లి జిల్లా భారతీయ ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శిగా జంగపెల్లి అజయ్ నియమింపబడ్డారు. జంగ పెల్లి అజయ్ మాట్లాడుతూ... నాకు బాధ్యత రావడానికి సహకరించిన పెద్దపల్లి బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మచ్చ గిరి రాము కి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి కి, పెద్దపల్లి బిజెపి జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవరెడ్డి కి, పెద్దపెల్లి ఓ బి సి మోర్చా అధ్యక్షులు చాతరాజ రమేష్ కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.పార్టీ నాకు అప్పగించిన బాధ్యతను ఎంతో గౌరవంగా స్వీకరిస్తున్నాను.

జర్నలిస్టు రామ్ కుమార్

కుటుంబానికి అండగా ఉంటాం



-కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చిన టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు ఎం.వంశీ

చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 5 : ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ప్రజాక్రాంతి స్టాఫ్ రిపోర్టర్, సీనియర్ జర్నలిస్ట్ పెండ్యాల రామ్ కుమార్ కుటుంబానికి జర్నలిస్టు యూనియన్ అండగా ఉంటుందని తీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు ఎం.వంశీ భరోసా ఇచ్చారు. రామ్ కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. రామ్ కుమార్ అకాల మరణం పట్ల తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జర్నలిస్టు గా రామ్ కుమార్ అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ, ఆయన మరణం జర్నలిస్టు వర్గానికి తీరని లోటని పేర్కొన్నారు.ఆప్తుడిని కోల్పోయిన బాధలో ఉన్న కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, ఏ కష్టం వచ్చినా జర్నలిస్టు యూనియన్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ప్రభుత్వం,యూనియన్ తరపున కుటుంబానికి అందాల్సిన సంక్షేమ పథకాలు,ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించేందుకు చొరవ తీసుకుంటా మని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా యూనియన్ ఎథిక్స్ కమిటీ చైర్మన్ పోతరాజు సమ్మయ్య, మంథని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు అంకరి కుమార్, ఎథిక్స్ కమిటీ కో-కన్వీనర్లు పందిళ్ల శ్యామ్ సుందర్, కే.ఎస్ వాసు, జర్నలిస్ట్ గంధం అంజిబాబు పాల్గొన్నారు.

ఓర్వలేకే ఎంపీ వంశీకృష్ణపై విమర్శలు



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 05 : పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం వంశీకృష్ణపై రాజకీయ దురుద్దేశంతో కొందరు వ్యక్తులు చేస్తున్న నిరాధార ఆరోపణలను, అసభ్యకర వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని నేతకాని మహోర్ సేవా సంఘం, సమతా సైనిక్ దళ్ నాయకులు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని కమాన్ ప్రెస్ క్లబ్‌లో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం స్వామి నేతకాని, వర్కింగ్ ప్రెసిడెంట్ జుమ్మడి కుమార్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గం నగేష్, భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు మౌల్కర్ ప్రేమ్ కుమార్ మాట్లాడుతూఎంపీగా గెలిచిన నాటి నుంచి వంశీకృష్ణ నియోజకవర్గ ప్రగతికి విశేషంగా కృషి చేస్తున్నారని తెలిపారు. మంచిర్యాలలో నేతకాని భవన నిర్మాణానికి ఎంపీ ల్యాడ్స్ నుంచి కోటి రూపాయల నిధులు కేటాయించారని గుర్తుచేశారు. గెజిట్‌లో నేతాని అని తప్పుగా ఉన్న పదాన్ని నేతకానిగా సవరించేందుకు రాష్ట్ర, కేంద్ర గెజిట్లలో ఆయన తీవ్ర కృషి చేస్తున్నారని వివరించారు.బసంత్ నగర్ విమానాశ్రయం,రామగిరి ఖిల్లా అభివృద్ధి, ఆర్ఎఫ్సీఎల్ వంటి కీలక అంశాలపై ఎంపీ వంశీకృష్ణ కేంద్రంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని కొనియాడారు. ఎంపీ వంశీకృష్ణపై సేగ్గం రాజేష్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు.దళితుల మధ్య చిచ్చుపెట్టేందుకు కొందరు ఇలాంటి చౌకబారు వ్యక్తులతో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా కుట్రపూరిత విమర్శలు, సంస్కారహీనమైన భాషను మానుకోకపోతే ప్రజలే తగినగుణపాఠం చెబుతారని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు సోదరి తిరుపతి, ఉపాధ్యక్షులు కొత్తపల్లి గంగేష్, జాడి రాజేష్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు గోమాస శ్రీకాంత్, కోశాధికారి దుర్గం చరణ్ దాస్, సీనియర్ నాయకులు సల్లూరి కిష్టయ్య, నాయకురాళ్లు జాడి కల,సేగ్గం చంద్రమ్మ,గవ్వల అనిత, తదితరులు పాల్గొన్నారు.

మాల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి ఎంపీ నిధులు

-జిల్లా బిజెపి అధ్యక్షులు రెడ్డబోయిన గోపి
-జిల్లా ప్రధాన కార్యదర్శి పాన్నాల తిరుపతిరెడ్డి



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 05 : ఎల్లారెడ్డిపేట మండలం బండ లింగంపల్లి గ్రామంలోని మాల సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారు ఎంపీ నిధుల నుండి మూడు లక్షలు నిధులను కేటాయించడం జరిగింది జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి జిల్లా ప్రధాన కార్యదర్శి పాన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ ఈ నిధుల మంజూరుతో సంఘ భవన నిర్మాణానికి మరింత ఊతం లభించనుంది. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించిన గౌరవ ఎంపీ గారికి సంఘం సభ్యులు, గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిజెపి ఉపాధ్యక్షుడు బాలగౌడు మెదుసు శ్రీనివాస్ రెడ్డి చింతల లహరి మాచర్ల హరికృష్ణ చీకట్ల ప్రవీణ్ గ్రామస్తులు కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల సరిహద్దుల వివరాలు పకడ్బందీగా నమోదు చేయాలి

-రీ సర్వే ప్రక్రియలో పారదర్శకత పాటించాలి
-రైతులకు అవగాహన కల్పించాలి
-అధికారులకు అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశం



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 05 : భూముల రీ సర్వే ప్రక్రియలో భాగంగా క్షేత్రస్థాయిలో భూముల సరిహద్దుల వివరాలను పకడ్బందీగా సేకరించి, పారదర్శకంగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు.వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామ పరిధిలోని జవహర్‌లాల్ తండాలో గురువారం కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను అదనపు కలెక్టర్ రెవెన్యూ, అటవీ శాఖల అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే పనుల పురోగతిని, భూముల హద్దుల గుర్తింపు ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ పరిధిలోని పట్టా భూములు, అటవీ భూముల సరిహద్దులను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత వివరాలను ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా నమోదు చేయాలని సూచించారు. సేకరించిన వివరాలను రైతులు, పట్టాదారులకు తెలియజేసి రీ సర్వే ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. భూముల హద్దులు, సర్వే నంబర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా నమోదు చేయాలని స్పష్టం చేశారు.రీ సర్వే విషయంలో రైతులు ఎలాంటి అపోహలకు గురికావద్దని, అధికారులకు అవసరమైన సమాచారం అందిస్తూ సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు సహకరించాలని అదనపు కలెక్టర్ కోరారు.ఈ పరిశీలనలో ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శ్రీనివాస్,తహసీల్దార్ నారాయణరెడ్డి,అటవీ శాఖ అధికారులు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.



పద్మశాలీల ఆత్మగౌరవ భవనానికి స్థలం కేటాయింపు హర్షణీయం

-హుజూరాబాద్‌లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 5 : హైదరాబాద్‌లోని కోకాపేటలో పద్మశాలీల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు కేటాయించడంతో పాటు విలువైన స్థలాన్ని కేటాయించడం పట్ల హుజూరాబాద్ నియోజకవర్గ పద్మశాలీ, కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పద్మశాలీల ఆత్మగౌరవాన్ని గుర్తించి, వారి అభివృద్ధికి ప్రాధాన్యత నిచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి గురువారం కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వి. హనుమంతరావు, పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్, చేనేత కార్పొరేషన్ చైర్మన్ దూదం వెంకటరమణతో పాటు వివిధ చేనేత సంఘాల నాయకులు, పద్మశాలీ సంఘం నాయకులకు ధన్యవాదాలు తెలియజేశారు.ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తూ హుజూరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ నాయకులు స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. పద్మశాలీల ఆత్మగౌరవం, ఐక్యతకు ఈ భవనం ప్రతీకగా నిలుస్తుందని, భవిష్యత్తులో సామాజిక, విద్యా, సాంస్కృతిక కార్యక్రమాలకు కేంద్రంగా ఉపయోగపడుతుందని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా చేనేత సంఘం అధ్యక్షుడు బండారి సదానందం, సంఘం శ్రీనివాస్, సంఘం సత్యనారాయణ, సంఘం శ్రీనివాస్, బీసీ నాయకుడు కాజీపేట శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ మహిళా మండల అధ్యక్షురాలు పుల్లా రాధా, టౌన్ అధ్యక్షుడు మార్త రవీందర్, గడ్డం రాఘవేంద్ర, మండల అధ్యక్షుడు కోమటి సదానందం, దాసి సదానందం, బీసీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకిడే



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 05 : వీణవంక మండల పరిధిలోని కనపర్తి, బ్రాహ్మణపల్లి, కోర్కల్ గ్రామాలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకిడే గురువారం సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. వి.బి.జి.రామ్ జీ పథకం కింద ఆయా గ్రామాల్లో మంజూరైన గ్రామఖ్య సంఘ భవనాల నిర్మాణ పనులను ఇతర అభివృద్ధి పనుల పురోగతిని ఆమె క్షేత్రస్థాయిలోపరిశీలించారు. అనంతరం కోర్కల్ గ్రామంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను సందర్శించి నాణ్యతా ప్రమాణాలను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఎల్. వెంకటేశ్వర్ రెడ్డి, తహసీల్దార్ రమేష్, ఆర్డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, హౌసింగ్ విభాగాల ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

బైండ్ ఓవర్ నిబంధనలు ఉల్లంఘించిన మహిళకు జరిమానా



చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట నవంబర్ 05 : బైండ్ ఓవర్ షరతులను ఉల్లంఘించిన నారాయణపూర్ గ్రామానికి చెందిన అనరాసి మమతపై ఎక్సైజ్ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. గతంలో విధించిన బైండ్ ఓవర్ నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన అధికారులు ఆమెకు రూ.20 వేల జరిమానా విధించారు.ఈ సందర్భంగా ఎల్లారెడ్డిపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ రెండ్ల విజేందర్ మాట్లాడుతూ.. బైండ్ ఓవర్ షరతులను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్ కింద కూడా చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

పూర్వ సైన్స్ అధికారికి సన్మానం



చురకలు (పెద్దపల్లి జిల్లా ప్రతినిధి) కమాన్‌పూర్ నవంబర్ 5 : జిల్లా పూర్వ సైన్స్ అధికారి బి.రవినందన్ రావును డి.ఇ.ఓ జి.శారద,ఘనంగా సన్మానించారు.డి.ఎస్.ఓ సేవలు అమోఘం అని అన్నారు.జిల్లా మొదటి సైన్స్ అధికారిగా తొమ్మిదేళ్ల పాటు ఉత్తమ సేవలందించి గత వారం న్యూఢిల్లీలో వరల్డ్ అలయెన్స్ ఆఫ్ స్కూల్ ప్రిన్సిపాల్స్ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్న పెద్దపల్లి జిల్లా పూర్వ సైన్స్ అధికారి బి.రవినందన్ రావును డి.ఇ.ఓ జి.శారద ఘనంగా సన్మానించారు. ఈ మేరకు గురువారం సాయంకాలం విద్యాశాఖ కార్యాలయంలో ఆమె శాలువా, జ్ఞాపికతో సన్మానించి గత డి.ఎస్.ఓ అందించిన సేవలను కొనియాడారు.విద్యార్థులలో శాస్త్రీయ అభిరుచిని పెంపొందించిన తీరును, పలు జాతీయ,అంతర్జాతీయ వైజ్ఞానిక పోటీల్లో జిల్లా విద్యార్థులు సాధించిన అవార్డులను ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ప్లానింగ్ కో-ఆర్డినేటర్ సి.హెచ్. మల్లేష్ గౌడ్,సూపరింటెండెంట్ లు సురేందర్, శ్రీధర్, టి.పి.టి.యు రాష్ట్ర నాయకులు కె.సారయ్య, ఎం.నరేష్,ఎల్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రిషన్ దశదిన కర్మకు ఎమ్మెల్యే హాజరు

-చిత్రపటానికి నివాళులర్పించిన కవ్వంపల్లి



చురకలు విలేఖరి,తిమ్మాపూర్ నవంబర్ 05 : ముషీరాబాద్‌లోని కాశిష్ కన్వెన్షన్ సెంటర్‌లో గురువారం నిర్వహించిన విద్యావేత్త, మిత్రుడు ఎం. క్రిషన్ దశదిన కర్మ కార్యక్రమానికి మానకొండూరు ఎమ్మెల్యే,టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు.ఇటీవల అనారోగ్యంతో మరణించిన క్రిషన్‌కు నివాళులర్పిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా అంజలి ఘటించారు.ఈ కార్యక్రమంలో ఐఏఎస్ అధికారి దొడ్డి ఆంజనేయులు,హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు.క్రిషన్ మృతి పట్ల ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ,ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు.

నందన్ పాల కేంద్రంను ప్రారంభించిన వైస్ చైర్మన్



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్, 05 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన నందన్ పాల కేంద్రాన్ని ఈ రోజు మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలకు నాణ్యమైన పాలు, పాల ఉత్పత్తులను అందుబాటులోకి తీసుకురావడానికి నూతనంగా పాల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. నూతనంగా వ్యాపారాన్ని ప్రారంభించిన నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వ్యాపారం దినదినాభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ఎస్.పి. రాజు, చెనిగరపు నరేష్, పెండం శ్రీనివాస్, కొండాజీ రాఘవేంద్ర చారి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు, కళాశాలల్లో హింస,వేధింపులను అరికట్టాలి

-సివిక్ సెన్స్ బోధన తప్పనిసరి చేయాలి
-ఓసీ జేఏసీ రాష్ట్ర నాయకురాలు పూసల ప్రభావతి రెడ్డి



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 5 : ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులపై జరుగుతున్న హింస, వేధింపులపై ఓసీ జేఏసీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు పూసల ప్రభావతిరెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలల్లో హింస,వేధింపులకు వ్యతిరేక అంతర్జాతీయ దినోత్సవం సందర్భంగా గురువారం హుజూరాబాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు.విద్యాసంస్థలు విద్యార్థులకు పూర్తిస్థాయిలో సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలని అన్నారు. విద్యార్థులు ఎలాంటి భయాందోళనలు లేకుండా చదువుపై దృష్టి సారించే పరిస్థితులు ఉండాలన్నారు. ప్రస్తుతం విద్యాసంస్థల్లో సైతం వేధింపులు, ఈవ్ టీజింగ్ వంటి ఘటనలు చోటుచేసుకోవడం ఆందోళన కరమని పేర్కొన్నారు. విద్యార్థుల మధ్య స్నేహభావం,సోదరభావం పెంపొందించాలని,కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళలు,యువతులు భయంలేకుండా జీవించేలా సమాజం బాధ్యత తీసుకోవాలని,వేధింపులను అరికట్టేందుకు చట్టపరమైన చర్యలతో పాటు సామాజిక చైతన్యం కూడా అవసరమని ప్రభావతిరెడ్డి అన్నారు. సురక్షితమైన విద్యా వాతావరణం, మహిళల భద్రత, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సివిక్ సెన్స్ బోధించాలి

విద్యార్థులకు చిన్నప్పటినుండి సివిక్ సెన్స్ బోధించడం ప్రభుత్వం తప్పనిసరి చేయాలని ఓసీ జేఏసీ రాష్ట్ర నాయకురాలు పూసల ప్రభావతి రెడ్డి కోరారు. బాల్యం నుండే చట్టాలపై శిక్షలపై అవగాహన కల్పించాలని, నైతిక విలువలను పాఠ్యాంశంగా బోధించాలన్నారు. రోడ్డుకు ఎడమ వైపునే నడవాలని, ద్విచక్ర వాహనాలను లైసెన్సు ఉంటేనే నడపాలని,అలాగే చెత్తను బయటపడే వద్దని,చెడు అలవాట్ల కు బానిసలు కావద్దని, సైబర్ నేరాలపై అవగాహన వంటివి కల్పించాలని అన్నారు.విద్యార్థులపై తల్లిదండ్రుల ప్రవర్తన కూడా ప్రభావం చూపుతోందని,కొన్ని కుటుంబాల్లో ముందుగా తల్లిదండ్రులు మారితే పిల్లలు కూడా మారతారని అన్నారు. తల్లిదండ్రుల మధ్య కుటుంబంలో ఘర్షణ పూరిత వాతావరణం మంచిది కాదన్నారు. టీవీలలో సినిమాలలో సోషల్ మీడియాలో హింసను ప్రేరేపితం చేసే కార్యక్రమాలను నిషేదించాలన్నారు .మంచి ప్రవర్తనతో మంచి సిటిజన్స్ గా ఎలా మారాలో చిన్నప్పటినుండే నేర్పించాలన్నారు. అలాగే ప్రభుత్వంపై ప్రభుత్వ కార్యక్రమాలపై కూడా, పౌరుల బాధ్యతలపై హక్కులపై కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులకు ప్రైమరీ విద్యను ఉండే ప్రభుత్వ నుండి సర్టిఫికెట్లు ఎలా పొందాలో, సామాజిక సమస్యలు ఉంటే ఎవరిని సంప్రదించా లో వంటివి నేర్పించాలన్నారు. హింసను రూపుమాపల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుందని ప్రభావతి రెడ్డి గుర్తు చేశారు.

తెలంగాణ డెమోక్రటిక్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్

జిల్లా అధ్యక్షుడిగా "విష్ణుదాసు"

-ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా



చురకలు ప్రతినిధి హుజూరాబాద్, నవంబర్ 5 : తెలంగాణ డెమోక్రటిక్ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడిగా హుజూరాబాద్‌కు చెందిన విష్ణుదాసు గోపాల్ రావు నియమితులయ్యారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి జయవర్ధన్ గురువారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. గోపాల్ రావు గతంలో రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ స్థానిక యూనిట్ కార్యదర్శిగా రెండు పర్యాయాలు పనిచేశారు. జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడిగా, పలు సంస్థల్లో జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకుడిగా వివిధ బాధ్యతలు ఆయన నిర్వహించారు. కళారంగంలో పలు అవార్డులు, అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు, పీవీ అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా గోపాల్ రావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు మహమ్మద్ ఉస్మాన్ పాషా, ప్రధాన కార్యదర్శి గంజి జయవర్ధన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో జిల్లా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి సీనియర్ సిటిజన్ల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానని, సంఘం కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా విస్తృతంగా నిర్వహిస్తానని అన్నారు. గోపాల్ రావు నియామకం పట్ల పలువురు సీనియర్ సిటిజన్లు, నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్షులుగా అంజయ్య

-మండల అధ్యక్ష పదవికి రసవత్తరంగా ఎన్నికలు
-11 ఓట్ల మెజార్టీతో గెలుపు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 05 : ఎల్లారెడ్డిపేట మండల విశ్వ బ్రాహ్మణ మనుమయ సంఘం అధ్యక్ష పదవికి ఎన్నికలు గురువారం రసవత్తరంగా జరిగాయి, మండల అధ్యక్ష పదవికి బండ లింగంపల్లి గ్రామానికి చెందిన కొత్తపెల్లి అంజయ్య (ఉంగరం గుర్తు) అల్యాస్పూర్ గ్రామానికి చెందిన మొగులోజీ కిష్టయ్య (కత్తెర గుర్తు)పై పోటీపడ్డారు. ఇరువురి మధ్య హోరాహోరీగా పంచాయతీ ఎన్నికలను తలపించే విధంగా విశ్వబ్రాహ్మణ మన్మయ సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్బులో ఉదయం 7:00 గంటల నుంచి మధ్యాహ్నం 3:00 గంటల వరకు ఎన్నికలు జరిగాయి. మండల అడక్ కమిటీ సభ్యులు వంగల వసంతం నల్ల నాగుల రామాచారి దుంపేటి కృష్ణమూర్తి కోదుమోజీ దేవేందర్‌ల పర్యవేక్షణలో ఓటర్ లిస్టు ప్రకారం ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగాయి. మండలంలో మొత్తము విశ్వబ్రాహ్మణ మనుమయ సంక్షేమ సంఘంలో 550మంది ఓటర్లుగా నమోదయ్యారు,కాగా 291మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.కొత్తపల్లి అంజయ్యకు 151ఓట్లు కిష్టయ్యకు 140ఓట్లు వచ్చాయి 11 ఓట్ల మెజార్టీతో అంజయ్య గెలుపొందినట్లు ప్రకటించారు. తనను ఎంతో విశ్వాసంతో అధ్యక్షునిగా గెలిపించిన విశ్వబ్రాహ్మణ మనుమయ సంఘ సభ్యులకు అందుబాటులో ఉండి అందరి సంక్షేమ కోసం పనిచేస్తానని అంజయ్య కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వంగల వసంతం జిల్లా ఉపాధ్యక్షులు జనార్ధన్‌లు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారిన విశ్వబ్రాహ్మణ మనుమయల బతుకులు మారడం లేదని అధికారంలో ఉన్న ప్రభుత్వం విశ్వా బ్రాహ్మణ మనుమయ సంక్షేమం గురించి పట్టించుకోవాలని ఆయన కోరారు. పనిముట్లను ఉచితంగా అందజేసి ప్రభుత్వం సబ్సిడీ వడ్డీ లేని రుణాలను ఇచ్చి ఆర్థికంగా ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.ఎన్నికల్లో మండలం లోని విశ్వబ్రాహ్మణ మనుమయ సంక్షేమ సంఘానికి చెందిన సభ్యులు పాల్గొన్నారు.

పాఠ్యాంశాలు నిత్యం సాధన చేయాలి

-ప్రణాళిక ప్రకారం చదవాలి
-కలెక్టర్ గరిమ అగ్రవాల్
-కోనరావుపేట కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో జిల్లా కలెక్టర్



చురకలు ప్రతినిధి రాజన్న సిరిసిల్ల, నవంబర్ 05 : విద్యార్థులు అన్ని పాఠ్యాంశాలు నిత్యం సాధన చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాం ,క్షించారు. కోనరావుపేట మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం తనిఖీ చేశారు. ముందుగా ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్ పరిశీలించారు. కిచెన్ లో మెనూ చార్ట్ పరిశీలించి.. దానికి అనుగుణంగా భోజన పదార్థాలు సిద్ధం చేస్తుండగా,తనిఖీ చేశారు. కూరగాయలు, బియ్యం, పప్పుల నాణ్యత పరిశీలించారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక ప్రణాళిక ప్రకారం అన్ని పాఠ్యాంశాలను చదవడం, రాయడం సాధన చేయాలని పేర్కొన్నారు. దీంతో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. తాము అనుకున్న లక్ష్యం చేరుకోవాలని ఆకాంక్షించారు. ఏదైనా ఉద్యోగం, స్వయం ఉపాధిలో స్థిరపడాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.కార్యక్రమంలో తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ స్నిగ్ధ, జీ సీ డీ ఓ పద్మజ తదితరులు ఉన్నారు.



కోర్కల్,లస్మక్కపల్లి చెక్ డ్యామ్‌లను వెంటనే పునర్నిర్మించాలి

-బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి



చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 05 : రైతు సంక్షేమం గురించి గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు క్షేత్రస్థాయిలో సాగునీటి సమస్యలను పూర్తిగా గాలికి వదిలేశారని బీజేపీ కరీంనగర్ మాజీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి మండిపడ్డారు. గురువారం వీణవంక మండల బీజేపీ అధ్యక్షుడు బత్తిని నరేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నాయకులు కోర్కల్,లస్మక్కపల్లి గ్రామాల్లోని దెబ్బతిన్న చెక్ డ్యామ్‌లను పరిశీలించారు.ఈ సందర్భంగా గంగాడి కృష్ణారెడ్డి మాట్లాడుతూ..వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచే చెక్ డ్యామ్‌ల పునర్నిర్మాణాన్ని గత బీఆర్ఎస్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోక పోవడం శోచనీయ మన్నారు.సొంత మండలమైన వీణవంక లో వేలాది ఎకరాలకు సాగునీరు అందించే చెక్ డ్యామ్‌లను బాగు చేయించాలని స్థానిక ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. గెలిచి మూడేళ్లయినా నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించి రాజకీయ విమర్శలకే పరిమితమ య్యారని ఆరోపించారు.కోర్కల్, లస్మక్కపల్లి చెక్ డ్యామ్‌ల పునర్నిర్మాణా నికి అధికారులు వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని,లేనిపక్షంలో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్. నరసింహరాజు ,పుప్పాల రఘు,వినోద్ కుమార్, రామిడి ఆదిరెడ్డి, ముత్యాల రవీందర్, శ్రీనివాస్ రెడ్డి,కొండల్ రెడ్డి,పెద్ది మల్లారెడ్డి, ఎనగంటి శ్రీనివాస్, సర్పంచులు దాట్ల వీరస్వామి,కొలిపాక రజిత శ్రీనివాస్, తనుకు సంధ్య సందీప్, హరికృష్ణ, ఎల్లగౌడ్,కర్రె నాని,అప్పని కొమురయ్య, పుప్పాల రోజా రాములు, రమణారెడ్డి, మారం తిరుపతి రెడ్డి,అర్షం శ్రీనివాస్, స్వామి, వెంకటేశ్వర్లు,అనిల్ రెడ్డి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పిటి స్వామి సేవలు స్ఫూర్తిదాయకం

-మరణానంతరం ఇద్దరికి చూపునిచ్చిన నేత్రాలు
-కుటుంబ సభ్యుల నిర్ణయం అభినందనీయం
-మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి)కమాన్ పూర్ నవంబర్ 5 : విద్య, సామాజిక సేవతోపాటు రాజకీయ, కార్మిక రంగాల్లో పీటీ స్వామి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సమాజ హితం కోసం జీవితాంతం కృషి చేసిన ఆయన.. మరణానంతరం కూడా తన నేత్రాలను దానం చేసి మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. పీటీ స్వామి ఇటీవల మృతి చెందగా, విషాదంలోనూ ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో గురువారం గోదావరిఖని లోని దుర్గానగర్ ఆర్‌కే గార్డెన్స్‌లో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్,మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌తో కలిసి పీటీస్వామి చిత్ర పటానికి నివాళులర్పించారు.

నేత్రదానంతో ఇద్దరికి చూపు...

అనంతరం పీటీ స్వామి కుమారుడు పీ.ఎస్.అమరేందర్ తోపాటు కుటుంబ సభ్యులకు సదాశయ ఫౌండేషన్ తరఫున అందజేసిన అభినందన పత్రాన్ని కొప్పుల ఈశ్వర్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బతికున్నంత కాలం ప్రజల కోసం, సమాజ అభ్యున్నతి కోసం పరితపించిన పీటీ స్వామి.. మరణం తర్వాత కూడా తన నేత్రదానంతో ఇద్దరికి చూపునిచ్చి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. తండ్రి చివరి కోరికకు అనుగుణంగా నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను కొప్పుల ఈశ్వర్, కోరుకంటి చందర్ అభినందించారు.

ఆలోచింపజేసిన నేత్రదానంపై అవగాహన...

సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింమూర్తి నేత్ర,అవయవ,శరీరదానాల ప్రాముఖ్యత ను వివరించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ఆరెపల్లి రాజమౌళి, కేవీస్ వాసు, నూతి సురేష్ కుమార్, జీవన్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిన యువ వ్యాపారవేత్త నల్ల వినయ్ రెడ్డి



చురకలు ప్రతినిధి,నిర్మల్, నవంబర్,05 : నిర్మల్ జిల్లా లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన యువ వ్యాపారవేత్త నల్ల వినయ్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. గురువారం హైదరాబాద్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నివాసంలో ఆయన పార్టీ కండువా కప్పుకుని గులాబీ గూటికి చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు సాదర స్వాగతం పలికి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ యువత బీఆర్ఎస్ పార్టీలో చేరడం శుభపరిణామమని పేర్కొన్నారు.యువత రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించడం ద్వారా సమాజ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు.ఈ నెల 11న నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న యువగర్జన సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, నిర్మల్, ఖానాపూర్ నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు రాంకిషన్ రెడ్డి,జాన్సన్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు రాము,అయ్యన్నగారి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.వడ్యాల్ గ్రామానికి చెందిన యువ వ్యాపారవేత్త నల్ల వినయ్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరడం పట్ల స్థానిక పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశారు.

పరామర్శించిన సునీల్ రెడ్డి



చురకలు పెద్దపల్లి జిల్లా ప్రతినిధి,కమాన్‌పూర్ నవంబర్ 5 : పెద్దపల్లి బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చందుపట్ల సునీల్ రెడ్డి కమాన్‌పూర్‌లో పలు కుటుంబాలను పరామర్శించారు.ఈ సందర్భంగా కమాన్‌పూర్ మండల బీజేపీ ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్ సోదరుడు కొమ్ము సతీష్ ఇటీవల హైదరాబాద్‌లో గుండెపోటుతో మరణించడంతో, వారి నివాసానికి వెళ్లి చిత్రపటానికి నివాళులర్పించి, శ్రీనివాస్ ని మరియు వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ, వారి బాధలో తాము కూడా పాలుపంచుకుంటున్నామని తెలియజేశారు.ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడం, కష్టసమయంలో ధైర్యం చెప్పడం మన నాయకత్వానికి నిదర్శనం. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబ సభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాము.ఈ కార్యక్రమంలో కమాన్‌పూర్ మండల బీజేపీ అధ్యక్షుడు కొయ్యడ సతీష్, బిజెపి పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము,నాయకులు, జంగిపల్లి అజయ్ పిల్లి చంద్రయ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రిలే నిరాహార దీక్షకు కోమిరెడ్డి లింగారెడ్డి మద్దతు



చురకలు ప్రతినిధి కోరుట్ల నవంబర్ ,05 : నియోజకవర్గ స్థాయి నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి మెట్పల్లి మున్సిపల్ కమిషనర్ తగిన చర్యలు తీసుకోవడంలో ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని విమర్శించారు. మున్సిపల్ కమిషనర్, చైర్మన్ వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను తొలగించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో చింతకుంట మాజీ సర్పంచ్ చెదలు సత్యనారాయణ, వెంకట్రావుపేట విశ్రాంత కార్యదర్శి కుందేళ్ల మురళి, ఎంపీడీవో సుభాష్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరవు జిల్లాగా ప్రకటించి ప్రజలను ఆదుకోవాలి

-రైతులకు ఎకరాకు రూ.50 వేలు, ఇతర పంటలకు రూ.30 వేలు నష్టపరిహారం ఇవ్వాలి
-సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్



చురకలు ప్రతినిధి హుజూరాబాద్ నవంబర్ 5 : ఎల్‌నినో ప్రభావంతో జిల్లావ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోయిందని, జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి కరువు జిల్లాగా గుర్తించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం హుజూరాబాద్‌లోని సిపిఎం పార్టీ కార్యాలయంలో ప్రతాప శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హుజూరాబాద్ మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించినప్పటికీ ప్రజలకు ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదని విమర్శించారు. జిల్లాలో కేవలం మూడు మండలాలనే కరువు మండలాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకుందని అన్నారు. సాగునీరు, తాగునీటి కొరతతో పాటు పంటలు ఎండిపోవడంతో రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.కరవు దృశ్య రైతాంగానికి ప్రజలకు భరోసా ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రూ.50 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీ సాధించాలని కోరారు. పంట నష్టాలను సమగ్రంగా అంచనా వేసి వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.50 వేలు, ఇతర పంటలకు ఎకరాకు రూ.30 వేల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమీక్షలు, ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో కరువు నివారణ చర్యలు అమలు చేయాలని సూచించారు.రెండు లక్షల రూపాయల లోపు పంట రుణాలతో పాటు అన్ని రకాల వ్యవసాయ రుణాలను మాఫీ చేయాలని, డ్వాక్రా మహిళా సంఘాల రుణాలపై ఏడాది పాటు వడ్డీ రహిత మారటోరియం ప్రకటించాలని కోరారు. పంటలు సాగు చేయలేని రైతులకు కూడా రైతు భరోసా, పీఎం కిసాన్ పథకాలను వర్తింపజేయాలని అన్నారు. కరవు పరిస్థితులు ఉన్నందున తెల్ల రేషన్ కార్డుదారులకు పూర్తిస్థాయిలో నిత్యావసర వస్తువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద ఏడాదికి 200 రోజుల పని కల్పించి రోజువారీ కూలీని రూ.800కు పెంచాలని అన్నారు. హుజూరాబాద్ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో కనీస వైద్య సదుపాయాలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని, గత మూడు నెలలుగా బీపీ మాత్రలు అందుబాటులో లేక రక్తపోటు బాధితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాసుదేవరెడ్డి తెలిపారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలని, అవసరమైన వైద్య సిబ్బందిని నియమించి మెరుగైన వైద్య సేవలు అందించాలని, జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.కొత్తగట్టు సమీపంలో జాతీయ రహదారి పనులు పూర్తికాకముందే టోల్ గేట్ ఏర్పాటు చేసి అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. టోల్ చార్జీల పేరుతో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికులపై అదనంగా రూ.20 భారం మోపడం సరికాదని, గతంలో ఉన్న బస్సు చార్జీలనే కొనసాగించాలని కోరారు. ఏసీ, డీలక్స్, సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ బస్సులు హుజూరాబాద్ బస్టాండ్‌లో ఆగకుండా బైపాస్ మీదుగా వెళ్తున్నాయని, అన్ని ప్రధాన బస్సులు బస్టాండ్‌లో ఆగేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కోతుల బెడద తీవ్రంగా పెరిగిందని, పంటలను నాశనం చేయడంతో పాటు ప్రజలపై దాడులు చేస్తున్నాయని, మున్సిపల్, అటవీ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేసి కోతుల బెడద నివారణకు శాశ్వత చర్యలు చేపట్టాలని కోరారు.ఖరీఫ్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని, కేంద్రాల ఏర్పాటు జాప్యం వల్ల రైతులు ప్రైవేటు వ్యాపారులకు తక్కువ ధరలకు ధాన్యం విక్రయించుకోవాల్సి వస్తోందని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం, గన్నీ సంచులు, రవాణా వంటి సమస్యలు లేకుండా చూడాలని, ప్రకటించిన మద్దతు ధరకు ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే సిపిఎం ఆధ్వర్యంలో ప్రజలను సమీకరించి ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల శంకర్, మండల కమిటీ సభ్యులు కదిరె రమేష్, కొంకట చంద్రయ్య, రాచపల్లి సారయ్య, వెంకటేష్, మోరే మహేష్, మైస చేరాలు, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు విలువైనవి



-జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

చురకలు ప్రతినిధి,జగిత్యాల, నవంబర్ 5 : పోలీసుశాఖలో హోంగార్డుల సేవలు విలువైనవని, అభినందనీయమని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. పదవీ విరమణ చేసిన హోంగార్డులు నరసింహులు, వెంకయ్యలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద ఒక్కొక్కరికి రూ. 1.30 లక్షల చెక్కులను గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అందజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులతో సమన్వయంతో విధులు నిర్వర్తించారని, పదవీ విరమణ తర్వాత కూడా వారి సంక్షేమానికి శాఖ ప్రాధాన్యత ఇస్తుందని, ఆర్థిక ప్రయోజనాలు సకాలంలో అందేలా కృషి చేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ సైదులు పాల్గొన్నారు.

ఆది వరాహ స్వామి డైరెక్టర్ మృతి



చురకలు (పెద్దపెల్లి జిల్లా ప్రతినిధి)కమాన్‌పూర్ నవంబర్ 5 : కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామానికి చెందిన శ్రీ ఆది వరాహ స్వామి ఆలయ పాలకవర్గ డైరెక్టర్ బొజ్జ సతీష్ బుధవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. గత రెండు రోజులుగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు గోదావరిఖనిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించారు.చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందారు. ఆయన పార్థీ దేహానికి ఏఎంసీ చైర్మన్ వైనాల రాజు, ఫ్యాక్స్ చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, జూలపల్లి సర్పంచ్ పోల్ దాసరి వనిత సాయికుమార్, ఆదివార స్వామి ఆలయ డైరెక్టర్లు తీగల రాజయ్య గౌడ్, పిల్లి రాజు, సాగి శ్రీనివాసరావు, బూస శ్రీనివాస్ గౌడ్, అనవేన శ్యామల సదయ్య,తోపాటు యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రెబల్ రాజ్ కుమార్, రామగిరి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తులసి రామ్ గౌడ్, రత్నాపూర్ మాజీ ఎంపీటీసీ ముస్త్యాల శ్రీనివాస్, రత్నాపూర్ మాజీ ఉపసర్పంచ్ కాటన్ సత్యం, భూస తిరుపతి, వార్డు సభ్యుడు చొప్పరి సంతోష్,తదితరులు పార్థివదేహానికి నివాళులర్పించారు. పలువురు డైరెక్టర్లు పాడిన మోయడం జరిగింది. సతీష్ కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు.

బీజేపీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షుడిగా బోయిని నారాయణ



చురకలు ప్రతినిధి మంథని, నవంబర్ 5 : బీజేపీ ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా ఉపాధ్యక్షులుగా మంథని నియోజకవర్గానికి చెందిన బోయిని నారాయణ నియమితులయ్యారు. ఓబీసీ మోర్చా పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు శాతరాజు రమేష్ ఆయనను ఈ పదవికి శుక్రవారం నియమించారు. ఈ సందర్భంగా బోయిని నారాయణ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తెలంగాణ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గందమల్ల ఆనంద్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రుపట్ల సునీల్ రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు కొండపాక సత్యప్రకాష్, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిడుగు కృష్ణ, ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు శాతరాజు రమేష్, బీజేపీ సీనియర్ నాయకులు మొలుమూరి శ్రీనివాస్, మంథని నియోజకవర్గ బీజేపీ కుటుంబ సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, మంథని నియోజకవర్గంలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేస్తానని ఆయన పేర్కొన్నారు.

నాణ్యతతో సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి

-జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా



చురకలు విలేకరి, జగిత్యాల, నవంబర్ 5 : జగిత్యాల పట్టణంలోని 35వ వార్డులో గురువారం సీసీ రోడ్డు పనులు ప్రారంభం కాగా,ఈ పనులను జగిత్యాల మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ జీనత్ పర్వీన్ మున్నా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వార్డు ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు. రోడ్డు నిర్మాణంలో ఎక్కడా రాజీ పడవద్దని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పేద విద్యార్థుల పదో తరగతి

పరీక్ష ఫీజులు చెల్లించిన బండి సంజయ్

-ఐదు జిల్లాల్లో 10,959 మంది విద్యార్థులకు ఆర్థిక భరోసా
-పేదరికం ప్రతిభకు అడ్డంకి కాకూడదనే లక్ష్యంతో ముందడుగు



చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 05 : పేద విద్యార్థుల చదువుకు పరీక్ష ఫీజులు ఆర్థిక భారంగా మారకూడదనే గొప్ప సంకల్పంతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ మరోసారి తన ఉదారతను చాటుకున్నారు. గత ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఐదు జిల్లాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫీజులను ఆయన స్వయంగా చెల్లించారు.రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, జగిత్యాల, సిద్దిపేట, హనుమకొండ జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన మొత్తం 10,959 మంది పదో తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజుల మొత్తాన్ని సంబంధిత జిల్లా విద్యాశాఖ అధికారులకు (డీఈఓలకు) అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులపై ఆర్థిక భారం పడకుండా, డబ్బుల కొరతతో ఎవరూ పరీక్షలకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ సందర్భంగా బండి సంజయ్ విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. పరీక్షల సమయంలో పిల్లలపై ఒత్తిడి తీసుకురాకుండా, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని సూచించారు. మంచి ఫలితాలు సాధించేలా ప్రోత్సహిస్తూ వారి ఉజ్వల భవిష్యత్తుకు కుటుంబ సభ్యులంతా అండగా నిలవాలని కోరారు.ఆర్థిక పరిస్థితులు విద్యార్థుల ప్రతిభకు అడ్డంకిగా మారకూడదనే ఆలోచనతో పరీక్ష ఫీజులను భరించడం అభినందనీయమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించడం ద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కల్పించారని పేర్కొంటున్నారు.